సాక్షి
వికారాబాద్
సోమవారం ၊ 14 ၊ ఏప్రిల్ ၊ 2025



నీటి కుంట.. తీర్చును చింత

వాగులు వంకల ద్వారా వృథాగా పోయే వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. 8లో▸



అంబేడ్కర్ జయంతిని..

అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని బీజేపీ నాయకులు ఆయన విగ్రహాలను శుచి, శుభ్రత కార్యక్రమం చేపట్టారు. 8లో▸



ప్రయాణ ప్రాంగణం..

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మర్పల్లి బస్టాండ్ శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. 9లో▸

న్యూస్‌రీల్

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

అనంతగిరి: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం తెలిపారు. ఆదివారం వికారాబాద్‌లో సంఘం 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, ఉపాధ్యక్షుడు నర్సింలు, కార్యదర్శులు నీలమ్మ, పవన్‌కుమార్, రత్నం, బసప్ప, ముత్యప్ప, జి.రాములు, తిరుపతి, అజయ్, శివప్ప, రాంచంద్రయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

దేశానికి పేరు తెండి



విష్ణు, శివను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

అనంతగిరి: ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన యువకులు పుట్టిన ఊరుకు.. దేశానికి మంచి పేరు తేవాలని ఎంపీడీవోల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీడీవో సత్తయ్య పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని గాంధీ కాలనీలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో ధారూరు మండలం తరిగోపుల గ్రామానికి చెందిన మోగిలేష్ కుమారులు విష్ణు, శివ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కావడంతో సంఘం తరఫున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనప్రాంతం నుంచి ఇద్దరు కుర్మ బిడ్డలు ఆర్మీకి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. దేశానికి సేవ చేసే భాగ్యం వారికి లభించిందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు గోపాల్, శివప్రసాద్, శ్రీశైలం, బుచ్చయ్య, నర్సింలు, శ్రీను, ల్యాబ్ నర్సింలు, రాములు, మాదవ్, సంధ్య, మహేష్ పాల్గొన్నారు.

చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి



అనంతగిరి: చేనేత హస్తకళలను ప్రోత్సహించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని ఫతేగార్డెన్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులు తయారు చేసిన వస్త్రాలు, ఇతర వస్తువులను పరిశీలించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పరిగి: పట్టణంలోని సాయిబాబా ధ్యాన మందిరం 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు ఆటపాటలు, కోలాటంతో సందడి చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.., ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యారంగం అభివృద్ధి, పరిరక్షణ కోసం టీఎస్ యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య పేర్కొన్నారు. సంఘం 12వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం మండల కేంద్రమైన ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు.

భానుడి కన్నెర్ర



రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత
- ఉక్కపోతతో జనం
- కనీస జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

వికారాబాద్: ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. మూడు రోజులుగా ఆయా మండలాల్లో 40 డిగ్రీల సెల్సియస్ దాటాయి. ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచే ఎండలు విజృంభించగా నెలాఖరున కురిసిన అకాల వర్షాలకు వాతావరణం చల్లబడింది. దీంతో 30 నుంచి 33 డిగ్రీల వరకు నమోదయ్యాయి. వారం రోజులుగా వాతావరణం కాస్త కూల్‌గానే ఉన్నా గురు, శుక్ర, శనివారాల్లో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. శుక్రవారం జిల్లాలోని 8మండలాల్లో 40 డిగ్రీలు దాటాయి. కొడంగల్, బంట్వారం మండలాల్లో అత్యధికంగా 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం.

తీవ్ర హెచ్చుతగ్గులు

రెండు మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండగా మరో పక్క తీవ్ర హెచ్చు తగ్గులు నమోదవుతున్నాయి. ఒకే రోజు.. ఒకే ప్రాంతంలో అత్యధిక మరియు అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. శుక్రవారం మర్పల్లిలో అత్యధికంగా 40.3 డిగ్రీలు నమోదు కాగా అదే రోజు అదే మండలంలో 19.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మోమిన్‌పేటలోనూ అత్యధికంగా 40.2 డిగ్రీల నమోదు కాగా అదే రోజు 21.5 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ఇలా చాలాచోట్ల ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో చలి తీవ్రత ఉండగా పగటిపూట వేడి తట్టుకోలేక పోతున్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

శుక్రవారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు డిగ్రీల్లో..

మండలం	అత్యల్పం	అత్యధికం
కొడంగల్	27	40.4
బంట్వారం	24.7	40.4
ధారూరు	29.1	40.3
మర్పల్లి	19.9	40.3
దుద్యాల్	25	40.3
మోమిన్‌పేట్	21.5	40.2
కోట్‌పల్లి	27.9	40.1
యాలాల	30.7	38.7
వికారాబాద్	27.9	38.7
పెద్దేముల్	28,4	38.6
దోమ	31.1	38.6
పూడూరు	27.6	38.6
దౌల్తాబాద్	32.1	38.6
తాండూరు	29,9	38.4
కల్కచర్ల	31.7	38.4
నవాబుపేట	24.3	38.3
పరిగి	30.00	38.00
బషీరాబాద్	29.4	38.1
బొంరాస్‌పేట్	30.6	36.7
చౌడాపూర్	29,9	36.5

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సాధ్యమైనంత వరకు మండుటెండలో తిరగరాదు. అత్యవసరం అయితే తప్ప బయటకు రాకూడదు.
- ఎండల తీవ్రత పెరుగుతున్నందున మద్యానికి దూరంగా ఉంటే మంచిది. మందు తాగడం వల్ల డీ హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంది.
- రోడ్ల వెంబడి విక్రయించే రంగులు కలిపిన శీతల పానీయాలను తాగరాదు. కలుషిత ఆహారం తీసుకోరాదు.
- సాధ్యమైనంత వరకు మాంసాహారం తగ్గించాలి. రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు తీసుకోవడం మంచిది. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- నిత్యం నీళ్లు ఎక్కువ తీసుకోవాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే మంచిది.
- రోజుకు కనీసం 12 నుంచి 15 గ్లాసుల నీరు తాగాలి. ఇలా చేయడం ద్వారా వడ దెబ్బ బారిన పడకుండా ఉండొచ్చు.
- వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు రోజుకు రెండు సార్లు స్నానం చేయాలి. ఉతికిన కాటన్‌తో కూడిన పలుచని దుస్తులు, లేతవర్ణం దుస్తులు ధరించాలి. ఆహారం మితంగా తీసుకోవాలి.
- సాధ్యమైనంత వరకు ఇళ్లలో ఉండాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లాంటివి వినియోగించాలి.
- చిన్న పిల్లలు, వృద్ధుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.

మహిళల రక్షణకు ‘టీ సేఫ్’

- ఏడాది క్రితం అందుబాటులోకి వచ్చిన యాప్
- ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం
- అవగాహన లేక సద్వినియోగం చేసుకోని మహిళలు



పరిగి: నిత్యం ఎక్కడో ఒక చోట మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల నగరం నడిబొడ్డున ఓ యువతిపై జరిగిన అత్యాచార ఘటన రాష్ట్ర ప్రజలని ఉలిక్కిపాటుకు గురి చేసింది. ఇలాంటి దారుణాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఏడాది క్రితం టీ సేఫ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. కేవలం మహిళల రక్షణ కోసమే ఈ యాప్‌ను రూపకల్పన చేశారు. అయితే ఏడాది కావస్తున్నా యాప్‌ను వినియోగిస్తున్న వారి సంఖ్య చాలా తక్కుగా ఉంది. మహిళలు దూర ప్రయాణాలు చేస్తున్నప్పుడు టీ సేఫ్ యాప్‌లో నమోదు చేసుకోవడం ద్వారా సురక్షితంగా గమ్యం చేరవచ్చని పోలీసులు అంటున్నారు.

ఇలా వినియోగించుకోవాలి

మొబైల్ ఫోన్లో ప్లే స్టోర్ ద్వారా టీ సేఫ్ యాప్ అని టైప్ చేసి సెర్చ్ చేస్తే రాష్ట్ర పోలీసు శాఖ అందుబాటులోకి తెచ్చిన యాప్ కనిపిస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పేరు, ఫోన్ నంబర్ నమోదు చేసి రిజిస్టర్ అవ్వాల్సి ఉంటుంది. హెల్ప్ సిటిజన్ విభాగంలో క్లిక్ చేసి ప్రయాణిస్తున్న ప్రాంతం పేరు ప్రయాణిస్తున్న వాహనం, దాని రిజిస్ట్రేషన్ నంబరు నమోదు చేయాలి. ఒక వేళ రైలు ప్రయాణం చేస్తే ఆ రైలు రూట్ నంబర్ ఎంటర్ చేస్తే చాలు. అనంతరం ప్రయాణం ప్రారంభించే ముందు స్టార్ట్ బటన్ నొక్కగానే సదరు సమాచారం పోలీసుల శాఖ పర్యవేక్షణలోకి వెళ్తుంది. ఇక అప్పటి నుంచి ఆ వాహనం లోకేషన్ గమ్యం చేరేవరకు పోలీసుల పర్యవేక్షణలో ఉంటుంది.

నిమిషాల్లోనే పోలీసులకు సమాచారం

ప్రయాణిస్తున్న వాహనం రూటు మారినా, ప్రయాన సమయానికన్నా ఆలస్యం అయినా పోలీసుల నుంచి ప్రతి ఐదు నిమిషాలకు ఒక సారి మెసేజ్‌లు వస్తాయి. దానికి వినియోగదారుల నుంచి రిప్లే ఇవ్వకుంటే కేసును అనుమానాస్పదంగా పరిగణించి నేరుగా ప్రయాణిస్తున్న వాహనం వివరాలు డయల్ 100కు వెళ్తాయి. లోకేషన్ ఆధారంగా సమీప పోలీస్ స్టేషన్ లేదా పెట్రోలింగ్ వాహనానికి సమాచారం చేరవేస్తారు. నిమిషాల వ్యవధిలో పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని బట్టి అవసరమైన చర్యలు తీసుకుంటారు. అనుకోని సందర్భాల్లో, విపత్కర పరిస్థితుల్లో ఇబ్బందులు పడే మహిళలను రక్షించేందుకు ఈ యాప్ చక్కగా ఉపయోగపడుతుందని, ఒంటరి మహిళలకు, యువతులకు రక్షణ కవచంలా పని చేస్తుందని పోలీసు ఉన్నతాధికారులు అంటున్నారు.

యాప్‌ను వినియోగించుకోవాలి



టీ సేఫ్ యాప్ మహిళలు, యువతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. సుదూరం వెళ్లి ఉద్యోగాలు చేస్తున్న వారికి, కళాశాలలకు వెళ్తున్న యువతులకు, సుదూర ప్ర యాణం చేస్తున్న వారికి చాలా ఉపయోగకరం. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగితే ఈ యా ప్ ద్వారా ఘటనా స్థలాన్ని గుర్తించవచ్చు. ప్రతి మహిళ మొబైల్‌లో ఈ యాప్ ఉండాలి. పోలీస్ శాఖ ద్వారా కూడా ప్రచారం చేస్తున్నారం.

– శ్రీనివాస్, డీఎస్పీ, పరిగి



చిలుకూరు ఆలయ పురవీధుల్లో స్వామివారి దివ్యరథోత్సవం

అశ్వ వాహనంపై ఊరేగిన బాలాజీ

- వైభవంగా రథోత్సవం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగారు. ఆలయంలో మహాభిషేకం, ఆస్థాన సేవ, దోప్‌సేవ, పుష్పాంజలి సేవలు అందించారు. వేదపండితుల మంత్రోశ్చరణలు.. భక్తుల గోవింద నామస్మరణలు.. డోలు, డప్పు వాయిద్యాల మధ్య చిలుకూరు బాలాజీ దివ్యరథోత్సవం నేత్రపర్వంగా సాగింది. చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి దివ్యరథోత్సవం శనివారం అర్ధరాత్రి కనుల పండువగా సాగింది. వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేతంగా రథంపై ఆసీనులై దేవాలయం చుట్టూ ఊరేగారు. శ్రీదేవి, భూదేవిలను వివాహం చేసుకున్న స్వామివారిని గ్రామస్తులకు చూపించే క్రమంలోనే రథోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకుడు రంగరాజన్ భక్తులకు వివరించారు. రాత్రి 11 గంటలకు స్వామివారు, అమ్మవార్లకు అద్దాలమహల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకొచ్చారు. రథం చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొదటి అంతస్తులో ఆసీనులను చేశారు. రథం ముందు అర్చకులు హోమం నిర్వహించారు. అనంతరం అర్చకులు, భక్తులు పెద్ద ఎత్తున గోవిందనామస్మరణ చేస్తూ రథాన్ని ముందుకు కదిలించారు. స్వామి వారి రథోత్సవంలో పాల్గొనటంతోపాటు రథాన్ని తాకితే అంతామంచి జరుగుతుందన్న విశ్వాసంతో భక్తులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, తిరుమల కిరణాచారి, పరావస్తు రామాచారి, నరసింహాసు కన్నయ్య, కిట్టు, మురళి పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడుదాం



మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు

షాద్‌నగర్: హక్కుల సాధనకు కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. పట్టణంలోని యమ్మి హోటల్‌లో ఆదివారం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఈ నెల 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీను, చంద్రబాబు, లింగంనాయక్, గోవింద్ నాయక్, జంగయ్య, రమేశ్, రాజునాయక్, శంకర్, పవన్ చౌహాన్, ఆకాశ్ పాల్గొన్నారు.

వలస కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

కొత్తూరు: జీవనోపాధి కోసం ఆయా రాష్ట్రాల నుంచి షాద్‌నగర్‌కు వచ్చిన వలస కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి పానుగంటి పర్వతాలు కోరారు. కొత్తూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఈ నెల 21, 22న శంషాబాద్‌లో నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయా రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులను పరిశ్రమల నిర్వాహకులు, కాంట్రాక్టర్లు శ్రమ దోపిడీకి గురిచేస్తున్నట్లు ఆరోపించారు. వెంటనే ప్రభుత్వాలు స్పందించి వలస, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, షకీల్, జంగయ్య, సంజీవ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలులో దూకుడు

- గడిచిన ఆర్థిక సంవత్సరంలో 93 శాతం టార్గెట్ పూర్తి
- లక్ష్యం రూ.9.68 కోట్లు.. వసూలు చేసింది రూ.9 కోట్లు
- మూడు మండలాల్లో వంద శాతం పూర్తి



పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లో పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

వికారాబాద్: పన్నుల వసూలులో జిల్లా పంచాయతీ విభాగం దూకుడు ప్రదర్శించింది. మొదట్లో కాస్త వెనకబడినట్లు కనిపించినా ఫిబ్రవరి, మార్చి మాసాల్లో వేగం పెంచడంతో టార్గెట్‌కు దగ్గరగా వచ్చారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి గ్రామ పంచాయతీలు పన్నుల వసూలులో లక్ష్యానికి చేరువయ్యాయి. రెండు నెలల క్రితం వరకు 50శాతం వసూళ్లకే పరిమితమైన యంత్రాంగం ఆ తర్వాత వేగం పెంచింది. ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ, నిరంతర సమీక్షలు పన్నుల వసూలుకు కలిసొచ్చాయి. పంచాయతీ కార్యదర్శులకు పనిఒత్తిడి ఉన్నా అధిగమించి పురోగతి సాధించారు. పది రోజుల క్రితమే ఆర్థిక సంవత్సరం ముగియగా 93శాతం పన్నులు వసూలు చేశారు.

వందశాతానికి చేరువలో..

జిల్లాలో 20 మండలాలు 594 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2,22,954 నివాసాలు ఉన్నాయి. పంచాయతీలు, మండలాల వారీగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. రూ.9.68 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో పాత బకాయిలు రూ.32.52 లక్షలు ఉండగా రూ.9 కోట్లు వసూలు చేశారు. పన్నులు, ఇతర ట్యాక్సెలు కలిపి 93 శాతం వసూలయ్యాయి. బంట్వారం, కోట్‌పల్లి, వికారాబాద్ మండలాల్లో వంద శాతం చేరుకున్నారు. యాలాల 86 శాతం, పెద్దేముల్ 87 శాతం, దౌల్తాబాద్ 88 శాతం వసూలు చేశారు.

లక్ష్యం చేరుకుంటాం

జిల్లాలో పన్నుల వసూలు 93 శాతం దాటింది. నాన్ ట్యాక్సుల వసూలులో కాస్త వెనుకబడిన మాట వాస్తవమే. త్వరలో 100 శాతం లక్ష్యం చేరుకుంటాం. ఈ దిశగా సిబ్బంది పని చేస్తోంది. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నాణ్యమైన సేవలు పొందాలి.

– జయసుధ, డీపీఓ

రైతు నెత్తిన.. విత్తన భారం



పత్తి విత్తన ప్యాకెట్ల ధరలు పెంచిన కంపెనీలు

- ఇప్పటికే పెట్టుబడి ఖర్చులు తడిసి మోపెడు
- మరింతగా పడనున్న ఆర్థిక భారం
- ఆందోళనలో అన్నదాతలు

షాబాద్: పత్తి రైతుపై ధరల పిడుగు పడింది. రానున్న వర్షాకాలం ప్రారంభానికి ముందే విత్తన కంపెనీలు అమాంతం ధరలు పెంచేశాయి. దీంతో ఇప్పటికే అతివృష్టి, అనావృష్టితో నష్టాలు చవిచూస్తున్న రైతులపై ఆర్థిక భారం మరింత పడనుంది. దీంతో పత్తి సాగువైపు ఈసారి రైతులు మొగ్గు చూపుతారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవైపు పెరుగుతున్న ధరలు.. మరోవైపు నకిలీ విత్తనాల బెడద కంటికి కునుకు లేకుండా చేస్తోంది.

ఏటా ధరల దడ

ఏటా పత్తి సాగుకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. విత్తనాలు, పురుగు మందులకు రూ.వేలల్లో వెచ్చించాల్సి వస్తోంది. దీనికి తోడు కూలీల ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు కలుపుతీత కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది. విత్తన కంపెనీలు ఏటా ధరలు పెంచుతుండడంతో మరింత భారం పడుతోంది. బీటీ పత్తి విత్తనాల ధర ఆరేళ్లుగా పెరుగుతూ వస్తోంది. 2019లో ప్యాకెట్ ధర రూ.710 ఉండగా ప్రస్తుతం రూ.901కి చేరింది.

తగ్గుతున్న పంట దిగుబడి

పత్తి పంట వేసిన నాటి నుంచి చేతికొచ్చే వరకు రైతులకు ఆందోళన తప్పడం లేదు. సరైన సమయానికి వర్షాలు పడకపోవడం.. పూత, కాత సమయంలో ఎక్కువగా పడటం తదితర కారణాలతో పంట దిగుబడులపై ప్రభావం చూపుతోంది. చేతికొచ్చిన పంట తీసే సమయంలో కూలీలు దొరక్క నేల రాలి దిగుబడి తక్కువగా వస్తోంది.

పెరుగుతున్న పెట్టుబడి

పత్తి పంట సాగు చేసేందుకు ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల ఖర్చు వస్తోంది. దుక్కి దున్నడం నాటి నుంచి భూమిని చదును చేయడం, విత్తనాలు వేయడం, కలుపు, మందుల పిచికారీ, పత్తి తీత కూలీ ఖర్చులు ఉంటాయి. ఎకరాకు రెండు ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉంటుందని రైతులు చెబుతున్నారు. గతేడాది బీటీ–2 పత్తి విత్తనం 475 గ్రాముల ప్యాకెట్ ధర రూ.867 ఉండగా ఈ ఏడాది రూ.901కి పెరిగింది. ఆయా కంపెనీలు అన్ని రకాల విత్తనాల ధరలు పెంచేశాయి. అంతకంతకూ పెరుగుతున్న పెట్టుబడులతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



పొలాన్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతు

ఖర్చులు పెరిగాయి



ప్రతీ సంవత్సరం పత్తి పంట సాగు చేసేందుకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. ఎకరాకు సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల దాకా ఖర్చు వస్తోంది. విత్తనాల ప్యాకెట్ల ధరల పెంపుతో మరింత భారం పడుతోంది. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– విజయభాస్కర్‌రెడ్డి, రైతు, మరియాపురం

ధరలు తగ్గించాలి



పత్తి విత్తనాల ధరలను ఏటా పెంచుతుండంతో ఆర్థిక భారం పడుతోంది. పెంచిన ధరలను కంపెనీలు వెంటనే తగ్గించాలి. లేదంటే ప్రభుత్వం రాయితీ ఇవ్వాలి. విత్తనాల కొనుగోలు నుంచి చేతికొచ్చిన పంట అమ్మే దాకా రైతుల చేతిలో ఏదీ ఉండడం లేదు.

– నర్సింహారెడ్డి, రైతు, మన్‌మర్రి

క్లుప్తంగా

ముగిసిన ఆంజనేయస్వామి జాతర



ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహిస్తున్న బాలేశ్వర్‌గుప్తా

యాలాల: బాక్వారం ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు ఆలయంలో సత్యనారాయణ స్వామి పూజ నిర్వహించారు. యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. జాతర సందర్భంగా హాజీపూర్, యాలాల, గోరేపల్లి, జక్కేపల్లి, దేవనూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కాగా శనివారం రాత్రి భక్తుల జనసందోహం మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ మాజీ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

'మా మసీదు' సందర్శనలో నేతలు

తాండూరు టౌన్: ప్రజలంతా సమానత్వం, ఆధ్యాత్మిక విలువలతో మెలగాలనేదే ఇస్లాం మత సారాంశమని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన మా మసీదు సందర్శన కార్యక్రమానికి మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి హాజరయ్యారు. ఆదివారం పట్టణంలోని ఖాన్‌కాలనీలో గల మహ్మదీయ అహ్లె హదీస్ మసీదును వారు సందర్శించారు. ఈ సందర్భంగా మత వక్తలు ఖురాన్ ప్రాముఖ్యత, మత విశ్వాసాలు, మానవ ధర్మం, నైతిక విలువలపై బోధన చేశారు. ఏ మతమైనా ఆధ్యాత్మిక భావాలతో, ప్రపంచ శాంతి కోరుకుంటుందన్నారు. వారి వెంట నాయకులు కరణం పురుషోత్తంరావు, అప్పు, యూనస్, శ్రీధర్, అశోక్, ముక్తార్‌నాజ్ తదితరులు ఉన్నారు.

'చలో వరంగల్'కు తరలివెళ్దాం

తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి



మాట్లాడుతున్న పైలెట్ రోహిత్‌రెడ్డి

తాండూరుటౌన్: చలో వరంగల్ పేరిట ఈ నెల 27న నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్దామని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పార్టీ నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా నేటికీ హామీలను అమలు చేయలేకపోతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్‌నే మళ్లీ సీఎంగా కోరుకుంటున్నారని చెప్పారు. అనంతరం నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఉప్పల్ స్టేడియంలో దొంగల చేతివాటం

ఉప్పల్: ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం అభిమానులు ఆనందంలో మునిగి తేలగా సెల్‌ఫోన్ దొంగలు చేతి వాటం చూపించారు. స్టేడియం భద్రతలో దాదాపుగా 3 వేలకు పైగా పోలీసులు పహారా కాస్తున్నా వారిని లెక్క చేయకుండా సెల్‌ఫోన్ దొంగలు హల్‌చల్ సృష్టించారు. వందలాది సెల్ ఫోన్లను దొంగిలించడంతో బాధితులు లబోదిబోమంటూ ఉప్పల్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. హైదరాబాద్ సన్ రైజర్స్ ఆటగాడు అభిషేక్ శర్మ పరుగుల వరద సృష్టించిన ఆనందంలో ప్రేక్షకులుండగా..దొంగలు చేతి వాటం చూపించినట్లు తెలిసింది. ఐపీఎల్ చరిత్రలోనే ఇంతగా సెల్‌ఫోన్లు దొంగిలించిన సంఘటన బహుశా ఇదే మొదటి సారి కావచ్చంటున్నారు. ఈ విషయంలో ఉప్పల్ సిఐ ఎలక్షన్ రెడ్డిని వివరణ కోరగా దాదాపుగా 15 నుంచి 20 మంది మాత్రం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నీటి కుంట.. తీరేను చింత

పాంపాండ్స్ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- తవ్వకానికి ముందుకురాని రైతులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



దౌల్తాబాద్‌లో ఓ రైతు పొలంలోని పాంపాండ్

దౌల్తాబాద్: వాగులు వంకల ద్వారా వృథాగా పోయే వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. నదులపై ప్రాజెక్టులు, వాగులపై చెక్‌డ్యాంలు నిర్మిస్తుంది. ఈ క్రమంలో భూగర్భజలాలు పెంపునకు రైతులు పాంపాండ్స్ తవ్వుకునేలా ప్రోత్సహిస్తోంది. తద్వారా బోర్లు, బావులు రీఛార్జి అవడంతో పాటు కుంటల్లోని నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ మేరకు ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న నీటికుంట (పాంపాండ్స్)లతో రైతులకు నీటిచింత తీరుతుందని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. రైతులు నయాపైసా ఖర్చు లేకుండా వీటిని నిర్మించుకోవచ్చంటున్నారు. మండలంలోని పలువురు రైతులకు మంజూరైనప్పటికీ వారికి అవగాహన లేక తవ్వుకునేందుకు ఆసక్తి చూపడంలేదు ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నారు. భూమి పోతుందనే ఆలోచనతో చాలా మంది రైతులు ముందుకు రావడంలేదు.

ప్రయోజనాలు

రైతులు వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా తమ పొలాల వద్ద నిర్మించుకునే చిన్న కుంటలను పాంపాండ్స్ అంటారు. బోరు బావులు, వర్షాధారంగా పంటలు సాగు చేసే రైతులకు వీటితో ఉపయోగాలుంటాయన్నారు. వ్యవసాయ క్షేత్రంలోని సాగు భూమిలో కొంతపోయినా భూగర్భజలాలు పెరుగుతాయి. భారీ వర్షాలకు భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చి నీరు గుంతలో చేరుతోంది. కుంటలో చేరిన మట్టి పొలాలకు ఎరువుగా ఉపయోగపడుతోంది. బోరు బావుల నుంచి కొద్దిపాటి నీరు వచ్చినా నీటి కుంటలను నింపుకొని ఒకేసారి పంటలకు నీటి తడులు అందించే వీలుంటుంది. దీంతో ఎకరాకు అవసరమయ్యే నీటితో రెండెకరాలు సాగు చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. నీటికుంటలతో వర్షాభావ పరిస్థితుల్లోనూ పంటలకు ఢోకా ఉండదని పేర్కొంటున్నారు.

దరఖాస్తు చేసుకుంటే చాలు..

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడంతో రైతులకు ప్రయోజనం చేకూర్చే నీటికుంటల నిర్మాణానికి రైతులు పైసా ఖర్చు చేయాల్సిన పనిలేదు. వర్షపు నీటిని పల్లపు ప్రాంతంలో నీటికుంట నిర్మించుకోవాలి. ఈ మేరకు ఉపాధి హామీ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే సిబ్బంది ఇచ్చే కొలతల ప్రకారం పాంఫండ్స్ తవ్వాలి. తవ్వకం పనులు ఉపాధి కూలీలే చేపడతారు. ఇందుకు రైతు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఆరు చదరపు మీటర్ల వెడల్పు, నాలుగు మీటర్ల పొడవు, 2 లేదా 3 మీటర్ల లోతు వరకు నీటికుంటలను నిర్మించుకోవచ్చని అధికారులు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్నాం

రైతులు వ్యవసాయ పొలాల వద్ద పాంపాండ్స్ ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. భూమి పోతుందని నిర్మించుకునేందుకు ముందుకు రావడంలేదు. నీటికుంటలతో లాభాలను రైతులకు వివరించి నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నాం.

– అంజిలయ్య, ఏపీఓ, దౌల్తాబాద్

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేద్దాం



అంబేడ్కర్ విగ్రహ శుచి, శుభ్రత కార్యక్రమంలో బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్

తాండూరు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాల సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాల శుచి, శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. పాత తాండూరు, బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, విగ్రహానికి జలాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ సమాన హక్కులను ప్రసాదించిన మహనీయుడు అంబేడ్కరుడని కొనియాడారు. ఆ మహనీయుడి అడుగుజాడల్లో ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. నేడు దళిత, ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, కార్యదర్శి భద్రేశ్వర్, అధికార ప్రతినిధి వెంకట్, పట్టణాధ్యక్షుడు మల్లేశం, పటేల్ విజయ్, సాయిరెడ్డి శ్రీకాంత్, బాలప్ప, రజినీకాంత్, దోమ కృష్ణ, కిరణ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను సాధిద్దాం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తోందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కేఎస్ రత్నం అన్నారు. పార్టీ పిలుపు మేరకు అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం అంబేడ్కర్ చైతన్య యాత్ర నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా కేఎస్ రత్నం మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆయన జీవితం అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్, దిశ కమిటీ సభ్యుడు వడ్లనందు, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి నవీన్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సదానందారెడ్డి, పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, సాయిచరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

- ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీ రద్దు చేశాం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పేదల భూములు తీసుకుని రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం యాచారం మండల పరిధిలోని మల్కీజ్‌గూడ, ధర్మన్నగూడ, నందివనపర్తి గ్రామాల్లో రూ.75లక్షల విలువ చేసే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం నందివనపర్తిలో జ్యోతి ఎడ్యుకేటర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సంఘ సేవకులు సంగం సత్తయ్య విగ్రహ ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన మేరకు పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు రోజుల్లోనే ఫార్మా రద్దు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైతే మార్కెట్ ధర చెల్లించి రైతులను ఒప్పించాలని.. ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసమే ఫోర్త్ సిటీ తీసుకొచ్చామన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి వేల కోట్ల రూపాయలు పెట్టుబడులతో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం చేపడుతున్నమన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనకబడిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, పాండురంగారెడ్డి, అమృతాసాగర్, ధనుంజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి పుస్తెల తాడు చోరీ

షాబాద్: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి గుర్తు తెలియని దుండగులు పుస్తెల తాడు లాక్కొని పారిపోయారు. ఈ ఘటన షాబాద్ ఠాణా పరిధి అస్పల్లిగూడ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన ప్రకారం.. షాద్‌నగర్ మండలం చౌలపల్లి గ్రామానికి చెందిన బోడ మాధవి కూతురు శ్రీవర్షిణి అస్పల్లిగూడ వద్ద బీసీ గురుకుల పాఠశాలలో చదువుతోంది. తన కూతురును చూసేందుకు బస్సు దిగి వెళ్తుండగా.. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఒకరు ఆమె వెంట నడుచుకుంటూ వెళ్లి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు లాక్కొని బైక్‌పై పారిపోయారు. ఈ క్రమంలో మాధవి మెడకు గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

హాజరైన మాజీ మంత్రి సబితారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని సార్లరావులపల్లిలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బంజార సేన రాష్ట్ర అధ్యక్షుడు జర్పుల ప్రవీణ్‌నాయక్, మాజీ సర్పంచ్ జర్పుల రజిత దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు దాసోజు శివప్రసాద్‌చార్యులు, నిరంజనాచార్యుల స మక్షంలో హోమాలు, ప్రత్యేక పూజల అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రజనీసాయిచంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథనాయక్; పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.మేఘనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిర తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భీమనాయక్, బాలునాయక్, నాగరాజు, శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు గోవర్ధన్‌నాయక్, జంగయ్య, దేవేందర్, సురేశ్, కొండల్‌రెడ్డి, డైరెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్‌కు గాయాలు

అత్తాపూర్: ఆటో డ్రైవర్‌పై మరో వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన అత్తాపూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన ప్రకారం... అత్తాపూర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ బాబా(40) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడు తన స్నేహితులతో కలిసి శనివారం మద్యం సేవిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మరి కొందరు మద్యం సేవిస్తుండగా మత్తులో మాటామట పెరిగి గొడవకు దారి తీసింది. వారి వద్ద ఉన్న కత్తితో సయ్యద్ బాబాపై దాడి చేశారు. దీంతో తల, ముక్కుపై గాయం అయింది. సయ్యద్ బాబా స్నేహితులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. సయ్యద్ బాబాపై దాడి చేసి పరారైన ముగ్గురిలో ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరొకరి కోసం గాలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎస్ఆర్ నిధులతో చెరువుల పరిరక్షణ

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: చెరువుల పరిరక్షణకు పారిశ్రామిక దిగ్గజాలు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఆయన అమెజాన్, సేక్రీస్ సంస్థల సహకారంతో కొత్తూరు పట్టణంలో చేపట్టనున్న సాయిరెడ్డి చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెంపునకు బహుళజాతి పరిశ్రమలు అనుసరిస్తున్న విధానం సంతోషకరమన్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లోకి భారీ వర్షాలు కురిసినప్పటికీ వివిధ కారణాల వల్ల వరద నీరు చేరడం లేదన్నారు. మరికొన్ని చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం చాలా వరకు తగ్గిందన్నారు. దీంతో భూగర్భ జలాలు త్వరగా అడుగంటుతున్నాయని వివరించారు. బహుళజాతి పరిశ్రమలు సీఎస్ఆర్ నిధులతో చెరువుల పరిరక్షణతో పాటు భూగర్భ జలాల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు భవిష్యత్‌లో సత్ఫలితాలిస్తాయన్నారు. అభివృద్ధి పనులు చేపట్టే సంస్థలకు రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని కోరారు. కొత్తూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సేక్రీస్ సంస్థ సీఈఓ దేవకాంత్, ప్రతినిధులు అమరేందర్, సురేశ్, షహనాజ్ అన్సారీ, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





మహానుభావా.. మన్నించుమా!

భారత రాజ్యాంగ నిర్మాత.. ప్రపంచ మేధావి.. అణగారిన వర్గాల ఆరాధ్యుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్.. అలాంటి మహోన్నత వ్యక్తి విగ్రహాలు ఏడాది నుంచి ప్రారంభానికి నోచుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. బొంరాస్‌పేట, తుంకిమెట్ల గ్రామాల్లో ఏడాది క్రితం అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. రాజకీయ విభేదాల కారణంగా వాటిని ప్రారంభించలేదు. బురాన్‌పూర్‌లో రెండేళ్ల క్రితం దిమ్మె నిర్మించి విగ్రహం ఏర్పాటును విస్మరించారు.. నేడు అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మహనీయుడి విగ్రహాలను ప్రారంభించాలని అంబేడ్కర్, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

– బొంరాస్‌పేట

భక్తిశ్రద్ధలతో ఉర్సు ఉత్సవాలు



ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో రెండు రోజులుగా సయ్యద్ మౌల మఖామ్ హుస్సేన్ (ఉర్సు) ఉత్సవాలను నిర్వాహకులు సిరాజుద్దీన్ ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం చందన పూజ, గంధం ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను నిర్వాహకులు శాలువ, పూవ్వుల మాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, రాంచంద్రారెడ్డి, బాబర్, అంతిరెడ్డి, సురేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దిర్సంపల్లిలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తోందని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రజతోత్సవాన్ని విజయవంతం చేయండి



రజతోత్సవ సభ వాల్‌రైటింగ్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: 25 ఏళ్లుగా రాష్ట్ర ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ పాటుపడుతోందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్ వేదిక నిర్వహించే రజతోత్సవ సభ వాల్‌రైటింగ్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం పుట్టిన పార్టీ బీఆర్ఆఎస్ అన్నారు. పార్టీ ఏర్పాటు నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన దిశగా అడుగులు వేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ పోరాడారని చెప్పారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి తప్పుదోవలో ఓట్లను దన్నుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌దే అధికారమన్నారు. వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుందఅశోక్ కుమార్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, రవికుమార్, కృష్ణ తదితరులు ఉన్నారు.

పల్లెలన్నీ బీజేపీ వెంటే..

పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రహ్లాదరావు



ఎస్సీ కాలనీలోని ఓ ఇంట్లో భోజనం చేస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: బీజేపీ విధానాలు.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు హర్షిస్తున్నారని పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు, టెలికం అడ్వైజరీ సెంట్రల్ కమిటీ సభ్యుడు ఘనపురం వెంకటయ్య అన్నారు. గావ్ చలో–కౌబస్తీ చలో కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని బొంరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజలంతా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను, హామీల అమలులో విఫలమవుతున్న తీరును పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో దిశ జిల్లా కమిటీ సభ్యుడు జానకీరాం, పార్టీ చౌడాపూర్ మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అంజిలయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

నందిగామ: కుటుంబ సభ్యులతో గొడవపడిన వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని నర్సప్పగూడ గోవిందు పోచయ్య కాలనీలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన దేవేంద్రమాలిక్(40) రాధిక దంపతులు తమ ఇద్దరు కొడుకులతో కలిసి వలస వచ్చారు. అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఐదు నెలలుగా మద్యానికి అలవాటుపడిన దేవేంద్రమాలిక్ పనికి వెళ్లడం లేదు. ఈ విషయంలో దంపతులు శనివారం అర్ధరాత్రి గొడవపడ్డారు. దీంతో దేవేంద్రమాలిక్ కుటుంబసభ్యులను ఇంటి నుంచి బయకటు పంపి గదిలోని పైకప్పునకు ఉన్న ఇనుప పైపునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రాధిక మాలిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. కాగా ఈ మృతిపై స్థానికంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

టీటైమ్ నిర్వాహకుడు..

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువకుడు చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ బ్లాక్ నెంబర్ 95/19లో నివాసముండే సుక్క రమేష్ కుమారుడు సుమన్ (22) నగరంలోని మాదాపూర్‌లో టీ టైమ్‌ను నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నమే ఇంటికి వచ్చిన సుమన్ తిరిగి మాదాపూర్‌కు వెళ్లలేదు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా చూసిన మృతుడి సోదరి రిషిత తన తండ్రికి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా సుమన్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని కుటుంబసభ్యులు, పోలీసులు చెప్పారు.

నీటి బకెట్‌లో పడి బాలుడి దుర్మరణం

నందిగామ: ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న బాలుడు నీటి బకెట్‌లో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చేగూరులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటాచారి కుమారుడు ఆద్యుత్(15 నెలలు) ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. ప్రమాదవశాత్తు అక్కడే నీటితో నిండి ఉన్న బకెట్‌లో పడిపోయాడు. అదే సమయంలో బయట నుంచి వచ్చి చూసిన తండ్రి వెంటనే సమీపంలోని కన్హా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అప్పటిదాక సందడి చేసిన బాలుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.